క్లుప్తంగా

మోసగిస్తే సహించం

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంత రైతుల పంటలను కొనుగోలు విషయంలో మోసం చేయాలని చూస్తే సహించేది లేదని ఏఎస్పీ, ఏవీఎస్పీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ములకపాడు గ్రామంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు సొంది మల్లూరు మాట్లాడుతూ.. ఏజెన్సీ మండలాల్లో రైతులను రిమోట్ కాంటాలతో మోసం చేసే దళారులు పుట్టుకొస్తున్నారని మండిపడ్డారు. ఇలా మోసం చేసే వారి విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్ నాయకుడు రేసు ఆదినారాయణమూర్తి, ఏఎస్పీ మండల నాయకుడు కొరస రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ రేసు వీరస్వామి, ఆదివాసీ రైతులు రామారావు, గోపాలరావు, బుర్రయ్య పాల్గొన్నారు.

ఆదివాసీలకు అన్నదానం

చర్ల: వారపు సంతకు వస్తున్న ఆదివాసీల ఆకలిని తీర్చేందుకు 'మీ కోసం మేమున్నాం' సహాయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారంఅన్నదానం నిర్వహించారు. దివంగత వానపల్లి అప్పల స్వామి, వానపల్లి చిట్టెమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు-కోడలు వానపల్లి మోహన్‌రావు, శ్రావణిలు ఈ అన్నదానానికి ఆర్థిక సహాయం అందజేశారు. బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని వివిధ ఆదివాసీ ప్రాంతాల నుంచి సుమారు 250 మంది ఆదివాసీలు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వహకులు లయన్ నీలి ప్రకాశ్, గొట్టిపాటి శ్రీనివాసరావు, జవ్వాది సతీష్‌కుమార్, దొడ్డి రమణారావు, మర్ల ప్రసాద్, దొడ్డి సూరిబాబు, దొడ్డా ప్రభుదాసు, చారి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు

ములకలపల్లి: మండలపరిధిలోని కమలాపురంలో పాల్వంచకు చెందిన గౌరి హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక హైస్కూల్ ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎంపీపీ మట్ల నాగమణి, ఎస్సై రాజమౌళి, సర్పంచ్ గొల్ల పెంటయ్య ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు సోమరాజుదొర, తేజస్వి రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. హెల్త్‌క్యాంపు కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ పోతుగంటి క్రాంతి, సోయం చిన్నారి, పత్తీలాల్, ముదిగొండ శ్రీను, మడకం చిరుమప్ప తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయ గుంపులో..

లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో గొత్తికోయ గ్రామమైన తోగ్గూడెం గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ కంటి ఆస్పత్రి, వైరా నిర్వాహకులు, లయన్స్ ఇంటర్నేషనల్ జీఎంటీ కో-ఆర్డినేటర్ ఉండ్రు శ్యాంబాబు పర్యవేక్షణలో 110 మంది వలస ఆదివాసీలను పరీక్షించి 45 మందికి కళ్లజోళ్లను అందజేశారు. 20 మంది కంటి శస్త్రచికిత్సలు అవసరమౌతాయని గుర్తించారు. క్లబ్ అధ్యక్షుడు రాయల కేధారేశ్వరరావు, సెక్రటరీ ప్రసాదరావు, ట్రెజరర్ రంజాన్, సభ్యులు పాండు రంగాచారి, జగన్, అనుమల శ్రీను, మడకం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల సంతాపం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీకి చెందిన గొడిశాల బిక్షం(65) శనివారం రాత్రి గుండెపోటుతో మరణించగా.. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య, మండల, పట్టణ నాయకులు ఆదివారం వారి గృహానికి వెళ్లారు. బిక్షం మృతదేహాన్ని సందర్శించి పూలమాలతో నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు తోట రమేష్, రైతు సంఘం జిల్లా నాయకుడు మంగీ వీరయ్య, బొగ్గు ముఠా అధ్యక్షుడు శ్రీకాకుళం వీరమల్లు, జగ్గన్న తదితరులు ఉన్నారు.

ఆవిర్భావ దినోత్సవం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆదివాసీ కొండరెడ్ల సంఘం ఆవిర్భావ దినోత్సవ సంబురాలను ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ కొండరెడ్ల సంఘం నాయకులు మార్కెట్ సెంటర్‌లోని అమరవీరులకు పూలమాలలు వేసి నివాళ్లులర్పించి మాట్లాడారు. కెచ్చెల భవాని, పూనెం వీరభద్రం, జగ్గా పుల్లయ్య, పూనెం కృష్ణ, కుంజా శ్రీను, పాయం రవి వర్మ, సొందె రవి, రామారావు రెడ్డి, రామ కృష్ణారెడ్డి, ముర్ల ఉమాదేవి పాల్గొన్నారు.

సన్మానం..

అశ్వారావుపేట: అశ్వారావుపేట మండల నూతన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ పాత్రికేయుడు శీమకుర్తి శ్రీనివాసరావుకు మండలంలోని ఊట్లపల్లి గ్రామంలో ఆదివారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుంకవల్లి వీరభద్రరావు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరై ప్రెస్‌క్లబ్, ఆర్యవైశ్య సంఘం, గ్రామస్తులతో కలిసి వీరభద్రరావును సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడారు. నాయకులు జూపల్లి రమేష్, జ్యేష్ఠ సత్యనారాయణ, బండారు శ్రీను, బత్తిన పార్థసారథి, ఆర్యవైశ్య సంఘం బాధ్యులు జల్లిపల్లి లోకనాథ్, గుప్తా, కొణిజర్ల ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, సంకా పూర్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న పందెం కోళ్లు

- సంక్రాంతి వేళ కోడి పందేలకు ఏర్పాట్లు
- అటవీ ప్రాంత గ్రామాల్లో బిర్రులు
- కోళ్లకు శిక్షణ మరూ..
- చేతులు మారనున్న కోట్లాది రూపాయలు



కోడి పందేలు నిర్వహించేందుకు తిప్పాపురం సమీపంలో నిర్వాహకులు సిద్ధం చేసిన ప్రాంతం

చర్ల: ఏజెన్సీలో సంక్రాంతి సందడి షురూ అయింది. కోడి పందేల నిర్వహణకు నిర్వహకులు బిర్రులను సిద్ధం చేసే పనిలో పడగా, పందె రాయుళ్లు కోళ్ల కాళ్లకు కత్తులు కట్టి పందేల్లో పాల్గొనేందుకు సై అంటున్నారు. తెలంగాణా సరిహద్దు గ్రామాల్లో పందేలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ సారి దట్టమైన అటవీ ప్రాంతాల్లో పందేలు నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందుతోంది. సరిహద్దు అటవీ ప్రాంత గ్రామాలైన బత్తినపల్లి-తిప్పాపురం, లెనిన్‌కాలనీ-కందిపాడు, కొయ్యూరు-బీఎస్ రామయ్యనగర్, కుర్నపల్లి-నిమ్మలగూడెం, పులిగుండాల-కొండెవాయి గ్రామాల సరిహద్దు అటవీ ప్రాంతాలతో పాటు ఉప్పరిగూడెం, భూముల్లంక, సింగసముద్రం, కోరెగడ్డ లంక తదితర గ్రామాల శివార్లలోనూ కోడిపందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు.. పందెం రాయుళ్లకు కూడా సమాచారం ఇస్తున్నారు. ఇటు భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాతో పాటు అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాలు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లోని పందెం రాయుళ్లకు సమాచారమిస్తున్నారు. బిర్రులకు వచ్చే పందేల నిర్వహణకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా ఉండేందుకు, ఎవరూ ఆటంకం కలిగించకుండా ఉండేందుకు గానూ ముందే నిర్వాహకులు అడ్డుకునే వారికి ముడుపులు ముట్టజెప్పేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

జూదరులకు షెల్టర్లు..

మూడు నాలుగు రోజుల పాటు కోడిపందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వహకులు.. దూర ప్రాంతాల నుంచి రెండు మూడు రోజుల ముందే బిర్రుల వద్దకు రావాలని ఆహ్వానిస్తున్నారు. వారికి ప్రత్యేకంగా షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. అటవీ ప్రాంత గ్రామాల్లోని కొన్ని ఇళ్లను ముందస్తుగా అద్దెకు తీసుకుని వారికి అవసరమైన అన్ని సౌకర్యాలనూ కల్పించనున్నారు. వారం రోజుల పాటు అక్కడే నివాసమున్నందుకు గానూ ఒక్కొక్కరూ అదనంగా రూ.వెయ్యి చెల్లించే విధంగా సమాచారమిస్తున్నారు.

మద్యం, మాంసం దుకాణాలకూ ఏర్పాట్లు..

సరిహద్దు గ్రామాల్లో కొనసాగే కోడి పందేలకు వచ్చే జూదరులకు మందు, మాసం అందుబాటులో ఉంచే విధంగా ప్రత్యేకంగా హోటళ్లను కూడా ఏర్పాటు చేసేందుకు నిర్వహకులు సిద్ధమవుతున్నారు. సమీప గ్రామాల్లో ఉన్న చిన్న చిన్న హోటళ్లు, కిరాణా దుకాణాలు, బెల్ట్‌షాపుల వారికి మందు, మాంసాహార భోజన పదార్థాలు సిద్ధం చేసుకోండని, వ్యాపారం మంచిగా సాగుతుందని ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో ఆశకు లోనవుతున్న వ్యాపారులు మద్యం, మాసం నిల్వ చేసుకునేందుకు ఆయా గ్రామాల సమీపాల్లోని చిరు వ్యాపారులు సమాయత్తమవుతున్నారు.

డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యం..

కోడి పందేలలో పాల్గొనేందుకు వచ్చే జూదరులు వీలైనంత మట్టుకు డిజిటల్ లావాదీలనే నిర్వహించాలని ఫోన్ పే, గుగూల్ పే, పేటీఎం, ఎస్‌బీఐ యోనో వంటి వాటి ద్వారానే లావాదేవీలు జరపాలంటూ నిర్వాహకులు పందేలకు వచ్చే జూదరులకు సమాచారం ఇస్తున్నట్లు తెలిసింది. పందేలు జరుగుతున్న సందర్భంలో పోలీసులు వస్తే కేవలం కోళ్లు, తక్కువ మొత్తంలో డబ్బుల మాత్రమే పట్టుబడవచ్చునని ఆ క్రమంలో జూదరులకు, నిర్వాహకులను పెద్దగా నష్టం ఉండదని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

పోలీసులకు సవాలుగా పందేలు..

సంక్రాంతిని పురస్కరించుకొని సరిహద్దు గ్రామాల్లో నిర్వహించే కోడి పందేలను నిర్వహించడం పోలీసులకు సాధ్యమేనా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

కోడిపందేలు నిర్వమించే నిర్వహకులు అటవీ ప్రాంతాల్లో బిర్రులను ఏర్పాటు చేస్తే మావోయిస్టుల ప్రాబల్య ప్రాంతాలు కావడం వల్ల పోలీసులు అటువైపునకు రావడం కష్టమవుతోంది. ఈ అభయంతోనే అటవీ ప్రాంతాలను కోడిపందేల నిర్వహణకు వేదికలుగా ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసు యంత్రాంగం ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

చట్టపరమైన చర్యలు



చర్ల మండలంలో కోడి పందాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడి పందాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్న సమాచారం అందుతోంది. అటవీ ప్రాంతాలను అడ్డుపెట్టుకుని కోడి పందాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారన్న సమాచారం మేరకు అటవీ ప్రాంతాల్లోనూ ప్రత్యేక బలగాలను మోహరిస్తాం. కోడి పందాలు ఆడుతూ పట్టుబడే వారిపై, పందాలను నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.

– సీఐ బి.రాజగోపాల్

రోడ్డు తవ్వారు.. వదిలేశారు..



రహదారిపై ఎగసిపడుతున్న దుమ్ము, ధూళి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ సమీపంలో సాయిబాబా ఆలయం వద్ద మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిని రోడ్డు నిర్మాణం కోసం కొద్ది దూరం రోడ్డును తవ్వారు. తవ్వి నెల రోజులు దాటినా కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో రహదారిపై వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిపై విపరీతంగా దుమ్ము, ధూళి ఎగిసిపడుతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు దుమ్ము, రాళ్లతో అవస్థలు పడుతున్నారు. రహదారిపై వాటరింగ్ చేయకపోవడంతో రహదారిపై ప్రయాణానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని కనీసం తవ్విన రహదారిపై రోజూ వాటరింగ్ చేయించాలని వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

సమష్టిగా పని చేయండి

దమ్మపేట: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలందరూ కలిసి సమష్టిగా పనిచేసి, పార్టీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు దిశా నిర్దేశం చేశారు. ఆదివారం మండలంలోని తాటిసుబ్బన్న గూడెంలోని మెచ్చా నివాసంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా మాట్లాడుతూ.. రేపు (మంగళవారం) ఖమ్మం పార్లమెంటరీ స్థాయి సమావేశం, హైదారాబాద్‌లో కేటీఆర్ సమక్షంలో జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య నాయకులు, కార్యకర్తలను ఆహ్వానిస్తున్నామని అన్నారు. నియోజకవర్గమును కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేశానని, పార్టీలకు అతీతంగా పోడు పట్టాలు ఇచ్చామని వెల్లడించారు. సంవత్సరంలోపే కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయే అవకాశము ఉందని అన్నారు. పార్టీ కార్యకర్తలు అందరూ ఐకమత్యంగా ఉండి, పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని కోరారు. అధికారులు విధుల విషయంలో పక్షపాత ధోరణి ప్రదర్శిస్తే, శాంతియుతంగా నిరసన, ధర్నాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, రావుల శ్రీను, జలగం వాసు, దేవరపల్లి అజయ్, యార్లగడ్డ బాబు, యార్లగడ్డ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగిన వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలిరాగా వారి మాటున మావోయిస్టులు, కొరియర్లు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, సానుభూతిపరులు రావచ్చన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. కుర్నపల్లి రోడ్, తాలిపేరు ప్రాజెక్ట్, పూసుగుప్ప రోడ్, గాంధీ సెంటర్, లెనిన్‌కాలనీ తదితర ప్రాంతాలలో మోహరించిన పోలీసులు.. వచ్చిపోయే వారిని నిశితంగా తనిఖీ చేశారు. సీఐ రాజగోపాల్ ఆదేశాల మేరకు ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి నేతృత్వంలో సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యలు, వారి జీఓల అమలు విషయాలను డైరీలో చక్కగా పొందుపరిచారని అన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలపారు. కార్యక్రమంలో అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెఎస్ఎల్‌వీ ప్రసాద్, కృష్ణమూర్తి, చల్లగుండ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్లు..

తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్ డైరీ, వాల్ క్యాలండర్, టేబుల్ క్యాలండర్లు, గత ఏడాది ప్రభుత్వ ఉత్తర్వుల పుస్తకాలను భద్రాచలం కార్యాలయంలో టీపీటీఎఫ్ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తమ బోధన ప్రణాళికలు రూపొందించుకోవడానికి క్యాలెండర్లు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సర్వీస్ సమస్యలకు డైరీలు, ప్రభుత్వం పుస్తకాల ద్వారా పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రామాచారి, సత్తిబాబు, ముత్తయ్య, ప్రకాశరావు, మల్లయ్య, సూర్యారావు పాల్గొన్నారు.

12 నుంచి వాలీబాల్ పోటీలు

అశ్వాపురం: మండల కేంద్రంలోని తురుముల గూడెం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో దివంగత గుగులోత్ జయరాం జ్ఞాపకార్థం ఈ నెల 12, 13, 14 తేదీల్లో మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బి.వీరన్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 12న సాయంత్రం 4 గంటల నుంచి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో వాలీబాల్ పోటీలు ప్రారంభమవుతాయి. ఈ పోటీల్లో పాల్గొనదలిచేవారు మండలానికి చెందిన జట్లు మాత్రమే అయి ఉండాలని, ఈ నెల 10న సాయంత్రం 3గంటల వరకు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో ప్రథమ బహుమతి రూ.15,016, ద్వితీయ బహుమతిగా రూ.12,016, తృతీయ బహుమతిగా రూ.10,016, నాలుగో బహుమతిగా రూ.5,016తో పాటు షీల్డ్‌లు అందజేస్తామని వీరన్న తెలిపారు. మండలంలోని వాలీబాల్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేకు వినతి

దమ్మపేట: భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేసిన కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్‌టీ) ఉద్యోగులను తిరిగి పునరుద్ధరించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో ఎమ్మెల్యేను సీఆర్‌టీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఆర్‌టీలు మాట్లాడుతూ.. 2019-20 విద్యా సంవత్సరం ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్‌టీలను తదుపరి రెన్యూవల్ చేయలేదని తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్న తమను తిరిగి రెన్యూవల్ చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి, న్యాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గణేష్‌కుమార్, రాజేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెన్నమల్ల జార్జి వర్ధంతి

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామంలో దివంగత కమ్యూనిస్టు నాయకుడు వెన్నమల్ల జార్జి 11వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. తొలుత సీపీఎం సీనియర్ నాయకురాలు ఆలవాల కమలమ్మ పార్టీ జెండాను ఎగురవేయగా.. వామపక్ష నాయకులు, గ్రామపెద్దలు జార్జి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, సీపీఐ మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, న్యూడెమోక్రసీ నాయకులు జగ్గన్నలు మాట్లాడారు. వెన్నమల్ల జార్జి ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పగిడేరు గ్రామంలో ఎల్లమ్మ మాటు భూముల కోసం ప్రజాపక్షాన నిలిచి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారన్నారు. సమితిసింగారం గ్రామానికి తాగునీటిని తీసుకొచ్చిన ఘనత వెన్నమల్ల జార్జిదేనన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఉప్పుతల నర్సింహరావు, వై.రంగా, దొడ్డి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టాన్ని మరువను



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల్లో శ్రమించి, నా విజయానికి కారణమైన నాయకులు, కార్యకర్తల కష్టాన్ని మరువనని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత అనంతారం గ్రామంలోని ఆరేపల్లి సూరిబాబు నివాసంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం పని చేసిన వారికి అన్యాయం జరగకుండా చూస్తానని, అండగా ఉంటానని అన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, రేమళ్ల కేధార్‌నాథ్, అల్లాడి రామారావు పాల్గొన్నారు.

మసీదును ప్రారంభించిన ఎమ్మెల్యే



మసీదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీలో మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మసీద్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం ప్రారంభించారు. అనంతరం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి, పథకాల అమలుకు కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని ముస్లిం కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, మసీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖాకీ యూనిఫాం ఇవ్వాలి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు కూడా ఖాకీ యూనిఫాం ఇవ్వాలని ఇఫ్టూ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఈ మేరకు ఇఫ్టూ ఆధ్వర్యంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగీలాల్ మాట్లాడుతూ.. ఇఫ్టూ విజ్ఞప్తి మేరకు సింగరేణి వ్యాప్తంగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఖాకీ యూనిఫాం అందించడం హర్షణీయమన్నారు. కానీ మణుగూరులో మాత్రం సదరు కాంట్రాక్టర్ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఖాకీ యూనిఫాం ఇచ్చేందుకు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు ఇఫ్టూ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంలో ఏరియా సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకుని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఖాకీ యూనిఫాం, ఇతర వస్తువులను కూడా పూర్తిగా ఉచితంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రామ్ అవతార్, డి.సుధాకర్, ప్రభాకర్, భరత్, జి.శ్రీను, వాసు, రబ్బాని, ప్రవీణ్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలి

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలోని ఓసీ-2 కొత్త సైట్ ఆఫీస్‌కు బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వి.వెంకటరత్నం యాజమాన్యానికి డిమాండ్ చేశారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉత్పత్తి, ఉత్పాదకతల సాధించేందుకు యాజమాన్యం ఓసీ-2 సైట్ ఆఫీస్, వర్క్‌షాప్‌లను తరలించేందుకు చర్యలు చేపడుతుండడాన్ని సీఐటీయూ స్వాగతిస్తోందన్నారు. కాని కొత్త సైట్ ఆఫీస్ కార్మికులకు దూరం కావడంతోపాటు అడవి మార్గం అయినందున బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రసాద్, లక్ష్మణరావు, ఈశ్వరరావు, లక్ష్మారావు, శ్రీకాంత్, సుమన్, బిక్షపతి, బుచ్చిరెడ్డి, నెల్సన్ రాజు, ప్రభాకర్‌రావు, శ్రీను పాల్గొన్నారు.

దుప్పట్లు అందజేత



అదివాసీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వికాస తరంగిణి ప్రతినిధులు

చర్ల: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం చర్ల మండలంలో ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీలకు ఉన్ని దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని చెన్నాపురం, ఉయ్యాలమడుగు, చెలిమెల, పూసుగుప్ప, క్రాంతిపురం, అడవి రామావరం గ్రామాల్లో 150 కుటుంబాల వారికి వీటిని పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ కార్యదర్శి కె.మధన్ మోహన్ మాట్లాడారు. కార్యక్రమాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, ప్రతినిధులు వై.సూర్యనారాయణ, వి.కామేశ్వరావు, డాక్టర్ వై.భాను ప్రసాద్, టి.సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

వికాస తరంగిణి ఆధ్వర్యంలో..

చర్ల మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామాల్లో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం సుమారు రూ.1 లక్ష విలువ చేసే దుప్పట్లను పంపిణీ చేశారు. చర్ల, భద్రాచలం శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్ట ఈ కార్యక్రమంలో సరిహద్దు గ్రామాలైన కురకట్‌పాడు, రామచంద్రాపురంలోని సుమారు 200 కుటుంబాల వారికి దుప్పట్లు, స్వెట్టర్లు, బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. వికాస తరంగిని కొత్తగూడెం చీఫ్ కోఆర్డినేటర్ జి.రమాదేవి, భద్రాచలం చీఫ్ కోఆర్డినేటర్ పి.కమలా రాజశేఖర్, చర్ల బాధ్యులు గుంజి పురుషోత్తం, మానికరావు అశోక్, పి.సత్యనారాయణ, పి.శంకర్, వెంకటేశ్వరబాబు, వివి.రమణ, ఎడ్ల సత్తిబాబు, అలవాల మురళీ చెన్నం రాజు, బూక్యా బాలు, రాజ్యలక్ష్మి, చందు, భరత్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతల పంపిణీ



ములకలపల్లి: అక్షింతలతో ప్రదర్శన చేస్తున్న భక్తులు

ములకలపల్లి: అయోధ్య నుంచి వచ్చిన అంక్షింతలను ఆదివారం మండలకేంద్రంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. తొలుత స్థానిక భక్త అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారీగా భక్తులు, మహిళల హాజరై 'జై శ్రీరామ్ 'నినాదాల నడుమ మేళతాళాలతో వీధులన్నీ తిరుగుతూ ఇంటింటికీ అక్షింతలు అందజేశారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు డాక్టర్ కారంపూడి సత్యనారాయణరాజు, కార్యదర్శి గొడ్ల రాజు, కీసరి వీరభద్రం, ఆలయ కమిటీ అధ్యక్షుడు శనగపాటి రవి, పద్దం బుజ్జి. అత్యం రాంబాబు, కొదుమూరి రామకృష్ణ, వాసూరావు, బేతాళ వెంకన్నబాబు, పువ్వాల శ్రీనివాస్, మాచవరం వేణు, ఓబులబెట్టి ప్రభాకర్, వనమా వెంకన్న, పుల్లూరి జయశ్రీ. మణి, రమ, శాంతి, మంజుల, లక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం గ్రామంలో ఆత్మరామచంద్రస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు సత్యనారాయణ మూర్తి శ్రీరామ అయోధ్య అక్షింతలు వేదమంత్రాలు నడుమ ఆదివారం ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో మంగళవాయిద్యాలతో పురవీధుల గుండా ఊరేగించి గ్రామస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కండ్రపు త్రినాథ్ రెడ్డి, కండ్రపు సింగరయ్యరెడ్డి, వేణుబాబు, కెల్లా శేఖర్, పోతాబత్తుల మోహన్, కరి బుజ్జి, బద్రి హర్ష, గడ్డం బాలాజీ, మహిళలు వెంకటదుర్గ, రుక్మిణి, లావణ్య, సంధ్య, బేబి, దల్లి మణి తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట, మల్లెలమడుగు, బీజీ కొత్తూరు, అశ్వాపురం గ్రామాల్లో ఆదివారం అయోధ్య నుండి వచ్చిన రాముడి అక్షింతలు ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి గ్రామపెద్దలు, భక్తులు, స్థానికులు ఇంటింటికీ తిరిగి అక్షింతలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ముత్తినేని సుజాత, సర్పంచ్‌లు మర్రి మల్లారెడ్డి, కోడి కృష్ణవేణి, ఎంపీటీసీ కమటం నరేష్, ఉపసర్పంచ్ సుధీర్, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీలోని రామానుజవరం, కొండాయిగూడెం, శ్రీకృష్ణాపురం గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంపన సీతారామరాజు ఆధ్వర్యంలో అయోధ్య రాముని అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామభక్తులు వల్లభనేని నాగేశ్వరరావు, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.